రాయచోటి తహశీల్దార్‌కు నోటీసు

ప్రజాశక్తి-రాయచోటి: ఒక సివిల్ కేసులో రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇచ్చిన ఇంజక్షన్ ఆదేశాలను ధిక్కరించినందుకు రాయచోటి తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లకు బ్రాహ్మణ వీధికి చెందిన పాముల మల్లికార్జున అనే వ్యక్తి నోటీసులు జారీ చేసినట్లు భారత న్యాయవాదుల సంఘం కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ మంగళవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన మల్లికార్జున అనే వ్యక్తికి ఉన్న ఇంటి జాగాలో అదే వీధికి చెందిన మురళి అండ్ హరిని దౌర్జన్యంగా తన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సివిల్ కేసును దాఖలు చేయగా సదరు వ్యక్తులు మల్లికార్జున జాగాలోకి వెళ్లకూడదని 2023 ఏప్రిల్ 10న కోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. తహశీల్దార్ తెలిసినప్పటికీ మల్లికార్జున కుటుంబ సభ్యులను ఈ నెల 20వ తేదీన తహశీల్దార్ ఆఫీస్‌కు పిలిపించి ఎగతాళిగా మాట్లాడుతూ ఇలాంటి పేపర్లు చాలామంది తెస్తారులే అని మల్లికార్జునకు వ్యతిరేకంగా అతని ప్రత్యర్థులను తహశీల్దార్ సపోర్ట్ చేసి కోర్ట్ ఆదేశాలను ధిక్కరించడమే గాక కోర్ట్ ఆదేశాలనే అవమానపరుస్తూ తన స్థలంలో తన ప్రత్యర్థుల చేత గుంతలు తొవ్విస్తున్నారని పాముల మల్లికార్జున తహశీల్దార్, మున్సిపల్ అధికారులకు ఈరోజు నోటీసులు జారీ చేశారు అని న్యాయవాది టి.ఈశ్వర్ తెలియజేశారు.

కదం తొక్కిన కార్మికులు

- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- జులై 9న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు
- రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి
- నిరసన కార్యక్రమంలో కార్మిక, రైతు సంఘాల నాయకుల డిమాండ్

రాయచోటి : మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. ఎక్కడికక్కడ కదంతొక్కారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్త నిరసనలో భాగంగా రాయచోటి, మదనపల్లె రాజంపేట మున్సిపల్ కార్యాలయం, సబ్ కలెక్టరేట్, అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం కార్మికులు నిరసన తెలియజేశారు. మున్సిపల్, అంగన్వాడీ, విద్యుత్, వికెఏ, గ్రామ పంచాయతీ కార్మికులు నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నా ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ బ్రిటిష్ వాడితో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి, కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చి కార్పొరేట్ వ్యవసాయం వృద్ధి చేసే రైతులను నట్టేట ముంచేలా తెచ్చే చట్టాలను తిప్పి కొట్టాలన్నారు స్వతంత్రానికి ముందుగాని, తర్వాత గాని వచ్చిన కార్మిక చట్టాలు ఏవి కూడా ఒకరి దయతో వచ్చినవి కావని, వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న హక్కులని గుర్తు చేశారు. 3 నల్ల చట్టంతో రైతులను, 4 లేబర్ కోడ్లతో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి మున్సిపల్ జిల్లా కోశాధికారి సి.రాంబాబు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మె ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, విద్యుత్ రంగాల వారు పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మోడీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు తిరుపాల్, వెన్నయ్య, మంగమ్మ, శంకరయ్య, సుహాసిని, విజయమ్మ, పావని, మంజుల, పీరమ్మ, ఇందిరమ్మ, కుమార్, రమణ, నరసింహులు, నాగరాజు వెంకటరమణ పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు విద్వేల రవికుమార్ డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాల రాసి కొత్త చట్టాలను తీసుకొచ్చి కార్మిక యూనియన్లనే లేకుండా చేయాలని పన్నాగం పడుతుందన్నారు. ఇఎస్ఐ అమలు కాక కార్మికులు అనారోగ్యానికి గురైనప్పుడు వారి సొంత నిధులతోనే చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల నిర్లక్ష్యం చేసే ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలు అమలు చేసి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో యుఐజయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీహరి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వరమ్మ, విజయ పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యులకు, పేద లకు వ్యతిరేకంగా కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తూ కార్పొరేట్లకు అనుకూలంగా పరి పాలన చేస్తున్నాయని ఈ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, టమోటా మార్కెట్లో జాక్ పాట్ రద్దు చేయాలని, ఉపాధి పనిదినాలు 200 రోజులకు పెంచాలని, రూ. 600లు వేతనం ఇవ్వాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలు బలంగా ఉన్నప్పుడు కూడా కార్మికులకు అరకొరగా మాత్రమే అమలు జరిగేవని, ఇప్పుడు 44 కార్మిక చట్టాలను రద్దు చేసిన తర్వాత భారతీయ కార్మికులు బానిసల కంటే దారుణమైన పరిస్థితుల్లోకి నెట్టబడే ప్రమాదం పొంచిఉందని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే యాజమాన్యాలపై విధించే శిక్షలను తొలగించి, రాజ్యాంగబద్ధంగా పోరాడే కార్మికులపై క్రిమినల్ చర్యలు తీసుకునేలా చట్టాలను మార్పులు చేశారంటే, కార్పొరేట్ పెట్టుబడిదారుల లాభాల కోసమేనని విమర్శించారు. పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభాన్ని సామాన్య ప్రజలపై, కార్మికులపై బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు సంఘాలతో నిమిత్తం లేకుండా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, నాగరత్న, కృష్ణ, సవిత, రామకృష్ణ, రాజు, కృష్ణప్ప, శంకర్ నాయక్, గౌరీ, ప్రమీల, సుగుణ, ప్రభావతి, విజయ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : గాంధీ విగ్రహం వద్ద నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, పోరాడి సాధించుకున్న పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికులు పోరాడిసాధించుకున్న 29 కార్మిక చట్టాలను, పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని తక్షణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పి.జాన్ ప్రసాద్, ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, కోశాధికారి, కరతోటి హరినారాయణ, మంగంపేట మైనింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అధ్యక్ష, కార్యదర్శులు పొలగంటి శ్రీనివాసులు, ముత్యాల శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎన్.రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధాకుమారి, విఆర్ఎల సంఘం కార్యదర్శి లక్ష్మీకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొజ్జ శివయ్య, మాజీ సర్పంచ్, నారాయణ, డివైఎఫ్ఐ నాయకులు పామూరు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : గాంధీ విగ్రహం వద్ద ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మదనపల్లె : సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

దేవాదాయ శాఖ భూములను కాపాడుకుందాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను తప్పనిసరిగా పరిరక్షించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవాలయ భూముల పరిరక్షణపై జిల్లా స్థాయి భూ సంరక్షణ కమిటీ సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 9761 ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయన్నారు. ఈ భూములన్నింటినీ కూడా తప్పనిసరిగా సంరక్షించాలన్నారు. ఎక్కడైనా ఆక్రవణకు గురి అయి ఉంటే వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణ లో గుర్తించిన 1167.52 ఎకరాల భూములలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ఏదేని కోర్టుల్లో కేసులు ఉన్న వాటికి వెంటనే స్టే వెకేషన్ కొరకు కౌంటర్ దాఖలు చేయాలని దేవా దాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తంగా మొత్తంగా ఉన్న 9761 ఎకరాలకు గాను గత సెప్టెంబర్ మాసంలో నిర్వహించిన సమావేశం నాటికి 4866 ఎకరాల భూములు 1బి అడంగల్‌లో దేవాలయ పేర్లు నమోద య్యాయన్నారు. 5500 ఎకరాలకు సంబంధించి వన్ బిలో పేర్లు నమోద య్యాయని తెలిపారు. 2200 పైబడిన భూములకు వెంటనే వన్ బి అడంగల్‌లో సంబంధిత దేవాలయ పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని దేవాలయాలలో పారిశుధ్య కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలని, క్యూలైన్ మేనేజ్మెంట్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. కొన్నిచోట్ల దేవాలయ భూములను తక్కువ ధరకు వేలంలో లీజుకి ఇస్తున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు. సరైన ధరకు వేలం నిర్వహించి భూములను లీజుకు ఇవ్వాలని ఇఒలను ఆదేశించారు. వివాదాస్పద భూములన్నింటిని సర్వే చేయాలని సూచించారు. జాయింట్ సర్వే పెండింగ్ ఉన్న వాటిని ఆయా శాఖలు సమన్వయంతో 30 రోజులు లోపల పూర్తి చేయాలన్నారు. వన్ బి అడంగల్ పేరు మార్పులను 45 రోజులు లోపల చేయాలని రెవిన్యూ శాఖకు సూచించారు. ఆలయానికి ఆదాయం పెంచాలని, ప్రతి దేవాలయం భూమిని వేలంలో లీజుకు ఇవ్వాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వారి పరిధిలోని ఆలయాలను సందర్శించాలని సబ్ కలెక్టర్లు, తహశీల్దారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ అధికారి సి.విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాలకు చెందిన 5700 ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని వాటిని గుర్తించాల్సి ఉందన్నారు. భూములను గుర్తించిన పిదప వాటిని లీజుకు ఇవ్వడం ద్వారా దేవాలయ ఆర్థిక స్థితి మెరుగు పడుతుందని కలెక్టర్ కు వివరించారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఆర్‌టిసి బస్టాండ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రాజంపేట : ప్రధాన బస్టాండ్‌లో పారిశుధ్య నిర్వహణ మౌలిక వసతులు మెరుగుకు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం రాజంపేట ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పార్సిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. బస్టాండ్‌లో పారిశుధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆర్టీసీ ఆర్ఎంను కారణాలు అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌కు ఏఏ ప్రాంతాల బస్సులు వస్తాయి, ప్రయాణికుల ఆక్యుపెన్సి ఎంత తదితర వివరాలను కూడా ఆర్టీసీ ఆర్ఎం, డిఎంలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ లోపల, పరిసర ప్రాంతాలలో పారిశుధ్యాన్ని పక్కాగా నిర్వహించాలని ఆర్టీసీ ఆర్ఎం, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.

ప్రతిరోజు చెత్త సేకరణ చేయాలి : మండలం కూచివారిపల్లె పంచాయతీలోని చెత్త నుండి సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో ఎన్ని హాబిటేషన్స్, ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎంతమంది క్లాప్ మిత్రలు ఉన్నారు, రోజువారీ చెత్త సేకరణ చేస్తున్నారా, వారానికి ఎన్ని రోజులు చెత్త సేకరణ కు వెళ్తున్నారు, ఎన్ని వాహనాలు ఉన్నాయి, సేకరించిన చెత్త సెగ్రిగేషన్ చేస్తున్నారా లేదా అని కలెక్టర్ ప్రశ్నించగా పంచాయతీ పరిధిలో 12 హాబిటేషన్స్, దాదాపు 3800 హౌస్ హోల్డ్స్ ఉన్నాయని, 5 మంది క్లాప్ మిత్రలు రెండు రోజులకు ఒకసారి చెత్త సేకరణ చేస్తున్నట్లు పంచాయతీ సెక్రెటరీ కమలాదేవి కలెక్టర్కు వివరించారు. సేకరించిన చెత్తను ఎక్కడ ఉంచుతున్నారని కలెక్టర్ ప్రశ్నించగా, అక్కడికి కొద్ది దూరంలో ఉన్న డంపింగ్ యార్డ్‌లో చెత్తను ఉంచి, అక్కడే సెగ్రిగేషన్ చేసుకొని తీసుకు వస్తున్నట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, తహశీల్దార్ పీర్ మున్ని, ఆర్టీసీ ఆర్ఎం రాము పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని పరిరక్షించుకోవాలి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్

సమావేశంలో మాట్లాడుతున్న జాబీర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యా హక్కు చట్టాన్ని పరిరక్షించు కోవాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్ తెలిపారు. విశ్వం విద్యా సంస్థలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులకు నాల్గవ రోజు జాబీర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సూర్యరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాబీర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా విధానం కోసం ఉపాధ్యాయులు, విద్యార్థుల ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీరం చేస్తున్న కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు సూర్యరావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తిని నేటి విద్యార్థులు తీసుకుని, హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 12వ తరగతి పాఠ్య పుస్తకాల్లో భగత్ సింగ్ చరిత్రను తొలగించి ఆర్ఎస్ఎస్ అధినేత సావర్కర్ జీవిత చరిత్రను పొందుపరిచారన్నారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్, సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే లాంటి మహా నాయకులు చరిత్రను పాఠ్యాంశాల్లో తొలగించి భగవద్గీత, రామాయణం ఆర్ఎస్ఎస్ చరిత్రను పొందుపరచడం దుర్మార్గమన్నారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యను ఉమ్మడి జాబితా నుండి తొలగించి రాష్ట్రాలకు ఎలాంటి హక్కులు లేకుండా కేంద్రం తన గుప్పెట్లో పెట్టుకుంటోందన్నారు. యూనివర్సిటీలల్లో మేధావులు, నూతన పరిశోధన కేంద్రాలు గతంలో ఉండేవని, బిజెపి వచ్చిన తర్వాత జ్యోతిష్యం, భూతశాస్త్రం మనువాద, సూడో సైన్స్ కోర్సులని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇలాంటి కోర్సులను ప్రవేశ పెట్టి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. , ఇట్లాంటి విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని, రాష్ట్రంలోని మేధావుల్ని, తల్లిదండ్రులను, విద్యావేత్తలను కలుపుకొని పోరాటాలకు సిద్ధం కావాలని తెలిపారు. ఇలాంటి పోకడలకు వెళ్లకుండా కూటమి ప్రభుత్వం యూనివర్సిటీ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నరసింహ, డి.రమణ, విద్యార్థులు, పాల్గొన్నారు.

తిరంగా ర్యాలీలో చమర్తి, అఖిల పక్ష నాయకులు

దేశ సైనికులకు రుణపడి ఉండాలి

- తిరంగా ర్యాలీలో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, ప్రతి ఒక్కరూ దేశ సైనికులకు రుణపడి ఉంటూ సమాజంలో వారికి విఐపి గౌరవం ఇవ్వాలని రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. మంగళవారం రాజంపేటలో భారత సైనికులకు మద్దతుగా అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీగా హాజరైన ప్రజలు, అఖిలపక్ష నాయకులతో కలిసి ఆయన ఆర్అండ్‌బి బంగ్లా నుండి ఎన్టీఆర్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలో దేశ సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కులం లేదు, మతం లేదని తెలిపారు. అందరిదీ ఒకటే జెండా అది భారతీయ మువ్వన్నెల జెండా అని, ప్రతి ఒక్కరూ ఆ జెండాకు గౌరవం ఇస్తూ ఆ జెండా కోసం సరిహద్దుల్లో కాపలా కాస్తూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా దేశభద్రతకు పని చేస్తున్న సైనికులకు రుణపడి ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో ఎక్కడైనా సైనికులు కనబడితే వారికి విఐపి గౌరవం అందించి అందరూ వారిని గౌరవించాలని కోరారు. దేశంలో నిజమైన విఐపిలు అంటే సైనికులేనని తెలిపారు. వారి ప్రాణం అడ్డువేసి ప్రజల ప్రాణాలు కాపాడుతూ, దేశ గౌరవాన్ని నిలబెడుతున్నారని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పిన భారత సైనికులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో ఇంత పెద్ద ఎత్తున కుల, మతాలకు అతీతంగా అందరూ పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మనం భారతీయులమని, మనం ఇక్కడే బతకాలని తెలిపారు. మన జెండా మువ్వన్నెల జెండా అని, ఆ జెండా కింద ఉన్నంతవరకే మనకు గౌరవమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశాన్ని ప్రేమిస్తూ, సైనికులను గౌరవిస్తూ దేశ సేవ కోసం, దేశ ప్రతిష్ట కోసం పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలి

- మంత్రి లోకేష్‌కు సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-పీలేరు : ఇంటర్మీడియట్ విద్యా శాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రమోటీ జూనియర్ లెక్చరర్ల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అసోసియేషన్ సభ్యులు సోమవారం అమరావతిలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గురవయ్య మాట్లాడుతూ 1998, 1999, 2000, 2001 సంవత్సరాల్లో కామన్ సీనియారిటీ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం నుంచి స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా ప్రమోషన్ ఇచ్చారని తెలిపారు. ఈ ప్రమోటీ జూనియర్ లెక్చరర్లు ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ ప్రకారం 2018 వరకు ప్రిన్సిపాల్ గానూ, డిగ్రీ కళాశాల లెక్చరర్లుగా పదోన్నతులు పొందారని అన్నారు. కాగా, ఎన్నికల నియమావళి అమలుకు ముందు-2024 మార్చ్ 15న ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ లిస్ట్‌లోని ప్రమోటీలను పక్కనపెట్టి జూనియర్లైన డైరెక్ట్ రిక్రూట్లకే ప్రిన్సిపాల్స్ ప్రమోషన్లు ఇవ్వడం అన్యాయమని చెప్పారు. అప్పట్లో 197 మందికి ప్రమోషన్లు దక్కగా, డిసెంబర్ 2024 నుండి మే 2025 మధ్య మరో 110 మంది డైరెక్ట్ రిక్రూట్లకు ప్రమోషన్ లభించిందని వివరించారు. 290 మందికి ప్రమోషన్లు కల్పిస్తూ డైరెక్ట్ రిక్రూట్లకే లబ్ధి చేకూరిందని తెలియజేశారు. జిఒ 302 అమల్లో ఉన్నప్పటికీ, కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో అడ్వకేట్ జనరల్ ఇచ్చిన అసంబద్ధ నివేదిక ఆధారంగా ఒక వర్గానికి మాత్రమే లాభం చేకూర్చడం అన్యాయమన్నారు. ఒకే క్యాడర్లో 25 సంవత్సరాలకుపైగా సేవలందించిన వారిని పక్కన పెట్టడం తీవ్ర నిరాశపరిచిందన్నారు. 210 మంది ప్రమోటీ జూనియర్ లెక్చరర్లు విధుల్లో ఉన్నారని, వీరిలో చాలామంది 2030 నాటికి పదవీ విరమణ పొందనున్నారని, 30 ఏళ్ళ అనుభవం ఉన్నవారు కూడా ఉద్యోగోన్నతులు పొందకుండా ఉద్యోగ విరమణ చేయను చేయడం బాధాకరమన్నారు. అందుకు, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని ఖాళీల్లో ఈ సీనియర్ ప్రమోటీలను ప్రిన్సిపల్స్‌గా నియమిస్తే న్యాయం జరగవచ్చున్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి, ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపిసి ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగ సురేష్ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గేట్-25లో అర్హత సాధించిన విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్)లో గేట్ 2025కు అర్హత సాధించిన విద్యార్థులను సత్కరించే ప్రశంసా కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ స్థాయిలో జరిగే గేట్ (గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్) పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు కళాశాల అభినందనలు తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ మొత్తం 22 మంది విద్యార్థులు గేట్ అర్హత సాధించారని వెల్లడించారు. వీరిలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి ఇద్దరు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నుంచి 9 మంది, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుంచి 5 మంది, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నుంచి ఇద్దరు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం నుంచి 4 మంది, డేటా సైన్స్ విభాగం నుంచి ఒకరు ఉన్నారని వివరించారు.విద్యార్థుల కృషిని అభినందించారు. ఈ విజయానికి పునాది వేసిన అధ్యాపకుల మార్గదర్శకతను కొనియాడారు. గేట్ పరీక్ష ప్రతిష్టాత్మక ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశానికి, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగాలకు కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, డీన్ శ్రీమంత్ బసు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. విజేతలు తమ అనుభవాలను, సిద్ధతా వ్యూహాలను జూనియర్లతో పంచుకున్నారు. కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, తదితరులు గేట్ అర్హత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలి

- కమిషనర్‌కు ఎన్‌టిఎ సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలోని ఉపాధ్యాయులంతా ఉద్యోగోన్నతులు, బదిలీల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నారని, బదిలీలపై ప్రస్తుతం ఏర్పడిన ప్రతిష్టంభనను తొలగించి ఉపాధ్యాయ సంఘాలు కోరిన విధంగా వెంటనే ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఎ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు, కడప జిల్లా అధ్యక్షుడు ఎ.బి.రామకృష్ణమరాజు కోరారు. మంగళవారం వారు విజయవాడలో పాఠశాల విద్యా కమిషనర్ కె.విజయ రామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:45గా తీసుకోవాలని కోరగా 1:49 వరకు తీసుకునే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. బదిలీల షెడ్యూల్ గురించి కోరగా ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ కు సానుకూలంగా స్పందించా రని తెలిపారు.అయితే ఆన్ లైన్ కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందని చెప్పారు. ఒకసారి ఆలోచించి చెప్పండని విద్యాశాఖ కమిషనర్ చెప్పినట్లు వారు తెలియజేశారు. తెలుగు మీడియంను ప్రవేశ పెట్టాలని కోరగా మండలానికి ఒక తెలుగు మీడియం ఏర్పాటుకు ప్రయత్నం జరగవచ్చునని తెలిపారని పేర్కొన్నారు. ఏప్రిల్ 30 వరకు రేషనలైజేషన్ కట్ ఆఫ్ తేది పెట్టాలని కోరగా మార్చి 31 నాటికి విద్యార్థులు ఎక్కువ ఉన్నారని తెలపడం జరిగిందని పేర్కొన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో లాంగ్వేజ్ పండిట్‌లు కొనసాగించాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉన్నత పాఠశాలలో కాంపోజిట్ కోర్స్ ఉన్న పాఠశాలల్లో బాషోపాధ్యాయ పోస్టులను కొనసాగింపు హామీతో పాటు మరికొన్ని ముఖ్య విషయాలు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్‌తో ఉపాధ్యాయ సంఘాల చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. బుధవారం దాదాపు బదిలీల షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉందని కమిషనర్ విజయ రామరాజు తనను కలిసిన నాయకులకు సూచించారు.



కమిషనర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న భరత్‌కుమార్‌రెడ్డి

రామాలయ నిర్మాణం గ్రామ కమిటీకి అప్పగించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట పునరావాస గ్రామాల కోసం నిర్మిస్తున్న రామాలయ నిర్మాణాన్ని గ్రామ ఆలయ కమిటీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని వైసిపి నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, వైసిపి రాయలసీమ జోనల్ బూత్ కమిటీ కన్వీనర్, డిఆర్‌యుసి సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 72 ఎకరాల గ్రామానికి సంబంధించిన శ్మశాన స్థలం ఎపిఎండిసి సంస్థ తీసుకొని రెండు ఎకరాలు ఏవిధంగా కేటాయిస్తారని అన్నారు. ఎంత భూమిని కోల్పోతున్నామో అంత భూమిని ఇవ్వవలసిందిగా హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని పేర్కొన్నారు. మూడు గ్రామాల ప్రజలు దాదాపు 800 మంది కుటుంబాలకు కనీసం శ్మశాన స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మృతి చెందిన కుటుంబాలకు పరిహారం కింద ఉద్యోగాలు తదితర సమస్యలు పరిష్కరించే అంతవరకు గ్రామాన్ని విడిచి వెళ్ళేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్, కౌలూరు రమణారెడ్డి, గుజ్జల శ్రీనివాసుల రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, దేవకుమార్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

భూమిని సురక్షితంగా ఉంచడం అందరి బాధ్యత

- కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

భూమిని సురచితంగా ఉంచడం అందరి బాధ్యత అని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల అన్నారు. మంగళవారం దేశవ్యాప్తంగా వ్యవసాయ విశ్వవి ద్యాలయాల వైస్ ఛాన్సర్లు, ఐసిఎఆర్ సంస్థల డైరెక్టర్ల వార్షిక సమావేశాన్ని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఐసిడిఎస్‌ఆర్‌ను వ్యవసాయ విద్యా విస్తరణ, పరిశోధనలకు అనువుగా మార్చనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వ్యవసాయ రంగంలో పలు విజయాలను సాధించినట్లు ఆయన పేర్కొనడం పట్ల కెవికె కోఆర్డినేటర్ హర్షం వ్యక్తం చేశారు. పురుగుమందులు, ఎరువుల నియంత్రణ లేని వాడకం నేల ఆరోగ్యాన్ని క్షీనింప చేస్తుందని భవిష్యత్ తరాల కోసం కూడా భూమిని కాపాడలని ఆయన ఇచ్చిన సూచనలు అందరూ రైతులు పాటించాలని, వ్యవసాయాన్ని లాభదాయకమైన వ్యాపారంగా మార్చాలని ఆమె కోరారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు కూడా సహకరిస్తారని ఆమె తెలిపారు.

చెరువు ఆయకట్టుదారుల కమిటీ చైర్మన్ మృతి

ప్రజాశక్తి-రాయచోటి

రఘునాథరెడ్డి(ఫైల్ ఫొటో)

రాయచోటి కంచాలమ్మ గడ్డ చెరువు ఆయకట్టదారుల కమిటీ చైర్మన్ పాపిరెడ్డి రఘునాథ రెడ్డి (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య బాల నాగమ్మ, కుమారులు జయరామిరెడ్డి, అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన మోహన్ రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి వున్నారు. రఘునాథ రెడ్డి అంత్యక్రియ బుధవారం ఉదయం 10 గంటలకు వారి స్వగ్రామం ఎగువ అబ్బవరం కట్టవ క్రిందపాపిరెడ్డి గారిపల్లెలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బోనాల పండుగలో ఎమ్మెల్యే 'ఆకేపాటి'

ప్రజాశక్తి-వీరబల్లి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి బోనాల పండుగ ఉత్సవాలలో పాల్గొ న్నారు. మంగళవారం తాటిగుంటపల్లి పంచాయతీ షికారుపాలెంలో వైభవంగా బోనాల పండుగ జరిగింది. బోనాల ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా షికారుపాలెంలో గుడి నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపీనాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, జైచంద్ర, రవిరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్ర రెడ్డి , మల్లు రామ్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నా భర్త ఆచూకీ తెలపండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బ్రతుకుతెరువు కోసం 8 నెలల క్రితం కువైట్ వెళ్లిన తన భర్త రాజ బోయిన మనోహర్ ఈనెల 17 వ తేదీన ఇంటికి వస్తున్నట్లు చరవాణి ద్వారా తెలియజేసి ఐదు రోజులు అవుతున్నా ఇప్పటివరకు ఇంటికి రాలేదని, పట్టణ కేంద్రంలోని రాంనగర్‌లో నివాసం ఉన్నటువంటి రాజ బోయిన మనోహర్ భార్య రాజేశ్వరి, కుటుంబ సభ్యులు మంగళవారం పాత్రికేయుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుమార్తె గర్భవతి కావడంతో ఇంటికి వచ్చేందుకు 17వ తేదీన టికెట్ బుక్ చేసుకుని కువైట్‌లో శ్రీలంక విమానం ఎక్కి వస్తున్నట్లు చెప్పారని అన్నారు. తర్వాత పలుమార్లు ఆయనకు ఫోన్ చేస్తుంటే మొబైల్ పనిచేయలేదన్నారు. ఐదు రోజుల నుంచి ఎదురుచూస్తున్నట్లు వాపోయారు. తమ భర్త గతంలో కూడా కుటుంబాన్ని పోషించడానికి కువైట్ కు వెళ్లి ప్రతి రెండేళ్లకు ఒకసారి ఇంటికి వచ్చే వారన్నారు. ఈసారి ఇంటికి రాకపోవడంతో తమ భర్తకు ఏమైందో అంటూ బోరున విలపిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేష్ స్పందించి తమ భర్త ఆచూకీ తెలపాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళుతున్నట్లు తెలిపారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - నందలూరు

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. కడప- చెన్నై ప్రధాన రహదారిలోని బాహుదనది వంతెన సమీపంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎస్‌పి విద్యాసాగర్ ఆదేశాల మేరకు నిర్వహించడం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ర్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ప్రజాశక్తి-నందలూరు



ప్రేమికుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ

మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గొల్ల శ్రావణి (19), విఘ్నేశ్వ రన్ (21), ప్రేమపెళ్లి చేసుకొని మంగళవారం స్థానిక పోలీసులను ఆశ్ర యించారు. ఇద్దరు మేజర్లు కావడం, అమ్మాయి తాను ఇష్టపూర్వకంగా వివాహం చేసుకున్నానని పోలీసులకు తెలిపారు. ప్రేమికుల ఇద్దరి కుటుంబ సభ్యులను కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు పోలీసులు తెలిపారు.

భూ రీ సర్వేను పక్కాగా నిర్వహించండి : జెసి

భూ రీసర్వేపై వివరాలు సేకరిస్తున్న జెసి ఆదర్శరాజేంద్రన్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలో జరుగుతున్న భూ రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం నిమ్మనపల్లి మండలంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను, రెవిన్యూ కార్యాలయాన్ని, చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రెవెన్యూ ఉద్యోగులతో కలసి సమావేశం నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయం నుంచి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పిజిఆర్ఎస్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. వివిధ సేవల కొరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం పలు రిజిస్టర్లను, రికార్డులను తనిఖీ చేశారు. రెడ్డివారిపల్లి గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వేను పరిశీలించారు. భూ రీసర్వే పనుల్లో అవకతవకలు జరగకుండా క్షుణ్ణంగా సర్వే చేసి, రైతుల సమక్షంలో వారి భూమి వివరాలను వివరించి, నమోదు చేయాలన్నారు. భవిష్యత్తులో భూమి సమస్యలు తలెత్తకుండా ఉండడానికే భూ రీసర్వే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పిట్టావాండ్లపల్లి వద్ద చౌక దుకాణాన్ని తనిఖీ చేసి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, చక్కెర, పప్పు వంటి సరుకులను చౌక దుకాణాల వద్దనే అందించాలన్నారు. డీలర్లు సక్రమంగా ప్రజలకు సరుకులను అందించేలా పర్యవేక్షించాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న భూ రీసర్వే పనులపై, ప్రజలకు అందుతున్న రెవెన్యూ సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అమర్నాథ్, డిటి సిరాజుద్దీన్, ఆర్ఐ రమేష్, మండల సర్వే గోపీనాథ్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, విఆర్ఒలు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్ష అసమానతలను అధిగమించాలి

బి.కొత్తకోట : ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరిస్తున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి-రామాపురం

సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్ష అసమానతలను అధిగమించాలని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి వై.పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువు సెక్టార్ కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురం చిట్లూరు సెక్టార్ బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లె మంగళవారం వేసవి శిబిరంలో భాగంగా కిశోర బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాపురం సెక్టార్ హసనాపురం పంచాయతీ కస్పాలో హుస్సేనమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఒ పద్మావతి మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల పుట్టినప్పటి నుంచి వివక్ష ఎదుర్కొంటుంటారని, మగ పిల్లలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తుంటారని అన్నారు. ఆడపిల్లలు మగ పిల్లలకు ఏ విషయంలోనూ తీసిపోరని ఎంతో మంది మహిళలు నిరూ పణ చేశారని అన్నారు. ఇటీవల అంతరిక్షానికి వెళ్లి తిరిగి వచ్చిన సునీత విలియమ్స్, పాకిస్తాన్ లోని టెర్రరిస్టులను అంతం చేయడానికి మనం దేశం తరఫున ఆపరేషన్ సింధూరం పాల్గొన్న వీరనారీ మణులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమాజంలోని మూస పద్ధతులను పట్టుకుని తల్లిదండ్రులు ఆడపిల్లల పట్ల వివక్ష చూపడం తగదన్నారు. మగ బిడ్డ అయినా, ఆడబిడ్డయినా ఇద్దరికీ సమానంగా అవకాశాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక హక్కులు చట్టాలు కల్పించాయని అన్నారు. కిశోర బాలికలు హక్కులను చట్టాలను అవగాహన చేసుకుని తమకు లక్ష్యాలను నిర్ధారించుకుని బాగా చదివి ముందు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మజారాణి సుజాత, జిఎంఎస్‌కెలు రజిని, రాణి అంగన్వాడీ కార్యకర్తలు మాబుజాన్ జయమ్మ, రవణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : ఆడపిల్లల పట్ల లింగ వివక్షతను చూపరాదని మదనపల్లి సిడిపిఒ సుజాత అన్నారు. మంగళవారం రాచవేటివారిపల్లి సచివాలయం వద్ద కిశోరి బాలిక వికాసం పై నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని అన్నారు. ఆడవారి పట్ల మగవారు లింగ వివక్షతను చూపితే అది చట్టరీత్యా నేరం అన్నారు. మహిళలు పురుషులతో సమానంగా నేడు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని, వారికి ఉన్నత చదువు అందించాలని సూచించారు. సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులు వారి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో, గ్రామంలో నిత్యం పర్యటించి మహిళల సాధిస్తున్న ఘనతలను సమాజానికి, సమాజంలోని తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఐసిడిఎస్ బి.కొత్తకోట ప్రాజెక్టు పరిధిలో మండలంలోని గోళ్లపల్లి గ్రామ పంచాయతీ, గోళ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో డపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలపై ఏర్పాటు చేసిన సమావేశమానికి సూపర్‌వైజర్, ఎడబ్ల్యూహెచ్, ఎఎన్ఎం, ఆశా పంచాయితీ సెక్రటరీ సచివాలయ సిబ్బంది పాల్గొని కిశోరి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగ న్వాడీ సూపర్వైజర్ గౌరీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు :'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, అర్హులందరూ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్మో హన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తాటికుంటపల్లి పంచాయతీ, షికారుపాలెం భవాని అమ్మవారు ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం గ్రామస్తులు చమర్తిని దుశ్శాలువా ఘనంగా సన్మానించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులు చమర్తి దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు వంటి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. మండల అధ్యక్షులు భాను గోపాల్ రాజు, టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

వృద్ధులకు భోజనాన్ని అందిస్తున్న దాతలు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

వీరబల్లి మండలం వొంగిమల్ల గ్రామానికి చెందిన మాదా పెద్ద రెడ్డప్పరెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె అనితారెడ్డి, అల్లుడు లక్ష్మి శేఖర్ రెడ్డి, మనుమడు యస్వంత్ రెడ్డి రామాపురం మండలం బండపల్లి వద్ద ఉన్న ప్రేమాలయ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వృద్ధులకు అన్నదానం నిర్వహించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ గృహాల్లో జరిగే శుభకార్యాలకు ఇలాంటి వారిని కూడా గుర్తించుకోవాలన్నారు. అభాగ్యులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

చీనీ రైతుల్లో ఆశలు

- రోజురోజుకూ పెరుగుతున్న ధరలు..

- ఆనందంలో రైతన్నలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చీనీ ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిస్తుంది. నియోజకవర్గంలోని సింహాద్రిపురం, లింగాల, తొండూరు మండలాలలో అధికంగా చీని పంటను పండిస్తారు. చీకనీ కాయల మార్కెట్ యార్డులో చీనీ కాయల ధరలు పెరుగుతూ ఉన్నాయి. జనవరి నుంచి చీనీ కాయల ధరలు రైతుకు గిట్టుబాటు కూడా లేకుండా ఉన్నాయి. 10 రోజుల నుంచి ధరలు రోజురోజుకు పెరుగుతూ ఉన్నాయి. 10 రోజుల కిందట టన్ను ధర 20 వేల ఉండేది. ప్రస్తుతం ప్రస్తుతం పులివెందుల మార్కెట్లో టన్ను 30 వేల నుంచి 35 వేల రూపాయల మధ్య నడుస్తూ ఉన్నాయి. దీంతో రైతన్నలు ఒకింత ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే పెరుగుతూ కనీసం -టన్ను రూ. 40 వేల పైచిలుకు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. ఏది ఏమైనా పులివెందుల మార్కెట్ యార్డులో చీని కాయల ధరలు పెరుగుతూ ఉండడం చాలా ఆనందంగా ఉందని రైతులు అంటున్నారు.

మాజీ ముఖ్యమంత్రులకు నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె :మాజీ ముఖ్యమంత్రులైన ప్రకాశం పంతులు, కాసు బ్రహ్మానంద రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నేతలతో కలిసి పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఘన నివాళులర్పించారు. ప్రకాశం పంతులు 68వ, కాసు బ్రహ్మానంద రెడ్డి 31వ వర్ధంతులను పురస్కరించుకొని కాంగ్రెస్ నేతలు వేంపల్లెలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమర యోధునిగా, ఆంధ్ర రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా, సమైక్య మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా అటు కాంగ్రెస్ పార్టీకి, ఇటు రాష్ట్రానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి ఆంధ్ర కేసరిగా పేరు గాంచినట్లు చెప్పారు. విజయవాడ వద్ద కృష్ణా నదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజి ఆయన మానస ప్రాజెక్టు అన్నారు. ఆయన బట్టలు ఆయనే ఉతుక్కునే వారినే అంతటి నిరాడంబరుడు ప్రకాశం పంతులు అన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నరుగా, ఏఐసీసీ అధ్యక్షునిగా అటు కాంగ్రెస్ పార్టీకి, ఇటు రాష్ట్రానికి, దేశానికి ఎంతో సేవ చేసినట్లు తెలిపారు. కాసు గొప్ప పరిపాలనాదక్షుడు అన్నారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి, వేంపల్లె, వేముల, చక్రాయపేట, పెండ్లిమర్రి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, వెంకటేష్, మహబూబ్ బాషా, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు. **కడప :** బ్రిటిష్ వారిని ఎదిరించిన ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు అని జెకె విద్యా సాంస్కృతిక క్రీడాభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా అన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం 7 రోడ్ల సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆర్‌కె రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో జెకె లయన్ పఠాన్ ఖాదర్‌బాషా పూలమాల వేసి నివాళులర్పించారు.

సంగీతంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు సంగీతంపై గ్రంథాలయ అధికారి జె. శివ శంకర్‌రెడ్డి అవగాహన కల్పించారు. హార్మోనియం వాయిస్తూ సరిగమలపై క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థులు చిన్నతనం నుండి సంగీతంపై అవగాహన కలిగి ఉండడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. హార్మోనియంపై తనకు పట్టు ఉందని ఆసక్తి కలిగిన వారికి క్రమం తప్పకుండా శిక్షణ ఇస్తానని తెలిపారు. శిక్షణ తరగతుల్లో భాగంగా ప్రతిరోజు ఒక అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చదవడం అలవాటు చేసుకోవడం వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

ప్రజాశక్తి- చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండిక్షేత్రంలో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు మంగళవారం వేద పారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారా తోరణం, అగ్ని ప్రతిష్ఠ, హోమం,మూలమంత్ర హవనం, సోమకుంభ ఆవాహన,స్నపన తిరుమంజనం,లఘు పూర్ణాహుతి, గోష్టి,మహా మంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి ఉత్సవాలు తిరుమలకు చెందిన పాంచారాత్రాగమ పండితులు బి.వి. రామానుజాచార్యులు శిష్య బృందంచే వేద మంత్రోచ్చారణతో నిర్వహిస్తున్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

రైల్వేకోడూరు అభివృద్ధే ధ్యేయం : 'ముక్కా'

ప్రజాశక్తి రైల్వేకోడూరు

రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముక్కా ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో రాజ్ కన్వెన్షన్ హాల్లో మినీ మహానాడును న్విహించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అన్ని మండలాల నుంచి భారీగా నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ కోడూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం మా ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం 20 కీలక తీర్మానాలు చేసినట్లు తెలిపారు. చిట్వేలి-ఎనగలూరు మండలాలకు సాగునీటి కోసం సోమశిల వెనుకజలాలు తీసుకు రావడం, గుంజనయేరు మీద చెక్‌డ్యామ్‌లు నిర్మించి భూగర్భజలాల పెంపు, గాలేర-నగిరి కాలువ నీటిని రైతులకు అందించే చర్యలు, కోడూరు-వేంకటగిరి రహదారి తక్షణ నిర్మాణానికి తీర్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఖాది గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కెకె చౌదరి, ముక్కా వరలక్ష్మి, ముక్కా విశాల్ రెడ్డి, ముక్కా సాయి వికాస్ రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంలో విద్యార్థులు

గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలు

ప్రజాశక్తి-కలకడ

గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని కలకడ శాఖ గ్రంథాల అధికారి అమరనాథ తెలిపారు. మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు తెలిపారు. వేసవిలో శెలవులలో ఇంటి వద్ద ఉన్న పిల్లలను తల్లిదండ్రులు గ్రంథాలయాలకు పంపించాలని సూచించారు. పిలల్లో మేథోశక్తి పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మంగళవారం విద్యార్థులకు కథలు చదవడం, చదివించడం, వినిపించడం, రాయడం, క్యారం బోర్డు ఆడించడం, చిత్రం లేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను ,తెలివితేటలను వెలికితీయడానికి సహకరిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, జాబ్ మేళాలతో చాలామంది నిరుద్యోగులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణ శివారులోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం యువతకు ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరిరీ ప్రభుత్వ ఉద్యోగం లభించడం సాధ్యం కాదని, అందుకే కూటమి ప్రభుత్వం తరుపున జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని, ఈ జాబ్ మేళాలో అనేకమంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో లక్షలాదిమంది నిరుద్యోగులు ఉద్యోగులుగా మారి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోబోతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, రాజంపేట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పలు కంపెనీల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎపిడి నందకుమార్‌రెడ్డి

'ఉపాధి' కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉపాధి హామీ పనులను ఎపిడి నందకుమార్‌రెడ్డి తనిఖీ చేశారు.మండలంలోని కనసానివారిపల్లి పంచాయతీ దిగవబోయపల్లి వద్ద కూలీలు పీడర్ ఛానల్ పనిని చేస్తున్నారు. ఉపాధిహామీ పనులను పరిశీలనలో భాగంగా మంగళవారం ఫీడర్ ఛానల్ పని పరిశీలించి అనంతరంకూలీలతో మాట్లాడారు. పనివిధానంపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారి కూలీ 307 రూపాయలు వచ్చే విధంగా పనిచేయాలని సూచనలు చేశారు.రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంచుకుంటే ఎకరాకు రూ.27 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.వ్యక్తిగత కంపోస్ట్ ఫీట్లను తవ్వుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకం చేపట్టాలన్నారు .ప్రతి పంచాయతీలోనూ మే నెలాఖరికి 25 ఫారం పాండ్ గుంతలను పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్‌కు సూచించారు .గ్రామంలో పనిచేస్తున్న అందరి కూలీల చేత యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు.రెండు మూడు రోజుల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు.పెండింగులో ఉన్న బిల్లులు కూడా జమవుతాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎపిడి వెంట ఎపిఒ సుబ్రహ్మణ్యం, టిఎ.నాగన్ గౌడ్, క్లస్టర్ టిఎ. బాబాజీ, కురబలకోట మండల సీనియర్ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ ఉన్నారు.

యోగాంధ్ర-2025ను పటిష్టంగా నిర్వహించాలి

-కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు జిల్లాలో యోగాంధ్ర-2025 కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో యోగాంధ్ర 2025, ప్రతి రోజు చెత్త సేకరణ, ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని శాఖల అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ,మున్సిపల్ అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును సాధించడానికి ఒక సమగ్రమైన మార్గం అని ఇది మన శరీరానికి బలం, వశ్యత, భంగిమను పెంచుతుందన్నారు.జూన్ 21న విశాఖపట్నం రామకృష్ణ బీచ్ లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలో కూడా యోగాంధ్ర 2025 పై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.